విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365

TGTEL/26/A6221

తొలివెలుగు



ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

యాదాద్రి భువనగిరి	సంపుటి: 01	సంచిక : 93	ఆదివారం	1-11 -2026	ఎడిటర్: యంజాల ప్రవీణ్	పేజీలు: 08	వెల: రూ.2/-
Yadadri Bhuvanagiri	Volume:01	Issue:93	Sunday	1-11-2026	Editor:Yamjala praveen	Pages:08	Cost:2/-

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు..

అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు.

రాప్తాడులో రక్తచరిత్ర

పదో తరగతి బాలికపై ఉన్మాది దాష్టీకం

- తరగతి గదిలో పిల్లలందరి మధ్య విచక్షణారహితంగా దాడి
- అడ్డుకోబోయిన మరో విద్యార్థినికీ తీవ్ర గాయాలు
- చదువుల తల్లి ఒడిలో రక్తపాతం.. వణికిపోయిన విద్యార్థులు
- అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో ఘటన
- నిందితుడిని ధర్మవరం రైల్వేగేటు వద్ద పట్టుకున్న పోలీసులు

క్షీణించిన శాంతిభద్రతలకు నిదర్శనమని ధ్వజం

తరగతి గదిలో ఉపాధ్యాయురాలు పాఠం చెబుతుండగా పదో తరగతి విద్యార్థినులు శ్రద్ధగా వింటున్నారు. అంతలో ఒక్కసారిగా ఎలక్ట్రిక్ రంపంతో ఓ యువకుడు దూసుకొచ్చాడు. బర్ర్‌ర్... అనే మోత.. ఏం జరుగుతోందో అర్థంచేసుకునేలోపే ఓ బాలికపై విచక్షణా రహితంగా దాడి.. చెయ్యి, మెడ, వీపుపై రంపపు కోత.. తరగతి గదంతా రక్తసిక్తం.. విద్యార్థినుల హాహాకారాలు.. అడ్డుకోబోయిన మరో విద్యార్థినికీ గాయాలు.. పాఠశాల ప్రాంగణం దద్దరిల్లింది. అనంతపురం జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది.

రాప్తాడు రూరల్ : ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న ఓ యువకుడు, తన ప్రేమను నిరాకరించిందనే అక్కసుతో బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడికి దిగడం సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఉదయం 10.20 గంటలకు రెండో పీరియడ్‌లో టీచర్ గణితం పాఠం చెబుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హేమంత్ అనే యువకుడు ఎలక్ట్రిక్ రంపంతో తరగతి గదిలోకి ప్రవేశించి.. గోపిక (15) అనే పదో తరగతి విద్యార్థినిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె ముఖంపై తీవ్ర గాయాలుకాగా, కుడిచేయి దాదాపు తెగిపోయింది.

- మిగతా 2వ పేజీలో

ఓట్ల చోరీ దేశ ద్రోహమే

- ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే నివాసంలో విపక్షాల మాక్ పార్లమెంట్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం
- ఏకగ్రీవంగా ఆమోదించిన 'ఇండియా'కూటమి ఎంపీలు
- సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- దేశద్రోహం ఆరోపణల కింద కోర్టులో విచారణ జరపాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ
- ఇతర సంస్థలను మూసివేయడం వల్లే ఇక్కడ భేటీ అయ్యామని వెల్లడి
- మన ఓట్లను కాపాడుకుందామని మల్లికార్జున ఖర్గే పిలుపు

న్యూఢిల్లీ: దేశంలో ఓట్ల చోరీకి పాల్పడిన ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై దేశద్రోహం ఆరోపణల కింద కోర్టులో విచారణ జరపాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నివాసంలో విపక్ష కూటమి 'ఇండియా'కూటమి ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ సమావేశం నిర్వహించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా బహిరంగంగా అభిశంసన తీర్మానాన్ని మల్లికార్జున ఖర్గే ప్రవేశపెట్టగా, సభ్యులంతా చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని తేల్చిచెప్పారు. "ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు పాల్పడడానికి, ఓటర్లను తొలగించడానికి, చేర్చడానికి, ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి అనుమతి ఇవ్వడం ద్వారా జ్ఞానేశ్ కుమార్ ఉద్దేశపూర్వకంగా చట్టాన్ని ఉల్లంఘించారు.

- మిగతా 2వ పేజీలో

తాగునీటి కోసం రూ.120 కోట్లు..

- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం

2లో

'మియాపూర్' భూముల వ్యవహారంలో విజయం కేసీఆర్ సర్కార్‌దే

- రేవంత్ పాలనలో 11 సార్లే వాదనలు
- కోర్టుల్లో కొట్లాడి కాపాడింది బీఆరెస్సే
- తానే రక్షించినట్టు సీఎం 'క్రెడిట్ చోరీ'
- బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు సిగ్గుచేటు
- తీర్పు వచ్చిన వెంటనే భూముల బేరం
- అబద్ధాలకు సీఎం బ్రాండ్ అంబాసిడర్
- సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

హైదరాబాద్:మియాపూర్, భూపాలపల్లి, హయత్‌నగర్ భూముల విషయంలో సీఎం రేవంత్‌పచ్చి అబద్ధాలు చెప్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్ మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నేతలపై తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను త ప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు వ్యవహారంలో 'వంటంతా మేం వం డితే.. గరిట తిప్పి నేనే వండిన అంటున్నడు. తీర్పునిచ్చిన జడ్జి సంతకం తడారకముందే, జడ్జిమెంట్ కాపీ రాకముందే, మియాపూర్ భూములను అమ్మకానికి పెట్టిండు' అని విరుచుకుపడ్డారు. 'కేసీఆర్‌ది భూ రక్షణ అయితే.. రేవంత్‌రెడ్డిది భూ భక్షణ' అని నిప్పులు చెరిగారు. శనివారం తెలంగాణ భవన్‌లో విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్, ఎమ్మెల్సీ దా సోజు శ్రవణ్, పార్టీ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, అభిలాష్ రంగినేని, తుంగ బాలుతో కలిసి విలేకరులతో హరీశ్ మీడియాతో మాట్లాడా రు. భూములను కాపాడేందుకు కేసీఆర్ సర్కా ర్ చేసిన ప్రయత్నాలు, కోర్టుల్లో వినిపించిన వాదనలను ఆధారాలు చూపి వివరించారు. మియాపూర్ భూముల విషయంలో డాక్టర్ ప్రసాద్‌తో బీఆర్ఎస్ కుమ్మక్కయిందని, భూ ములమ్మి డబ్బులు

- మిగతా 2వ పేజీలో

నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- మొత్తం ఓటర్లు 99,36,014 మంది..
- 11,378 పోలింగ్ కేంద్రాలు
- 13 నగరపాలక సంస్థలు, 79 మున్సిపాలిటీలకు ఎన్నికలు
- 13 మేయర్ పదవులకు పోటీలో 153 మంది
- మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు పోటీలో 367 మంది
- బందోబస్తుకు 36,351 మంది పోలీసులు



దమ్ముంటే చర్చకు రండి..

- ఇండియా కూటమికి అమిత్ షా సవాల్
- నేడు సీఈసీపై ప్రతిపక్షాల 'పబ్లిక్ ఇంపీచ్‌మెంట్' కార్యక్రమం
- వర్షం కారణంగా శుక్రవారం నాటి కార్యక్రమం శనివారానికి వాయిదా
- 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపిస్తున్న విపక్షాలు
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో 'చలో ఢిల్లీ' ర్యాలీకి పిలుపు

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు

- ఆగ్నేయ బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- మచిలీపట్నానికి 1200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం
- రేపటికి తుపానుగా మారి కావలి వద్ద తీరందాటే అవకాశం
- కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఈదురు గాలులు
- మత్స్యకారులు వేటకు వెళ్ల వద్దని హెచ్చరించిన వాతావరణ శాఖ

2లో

మూడేళ్లు గడుస్తున్నా పనులు ముందుకు కదలడంలేదు

- పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే ఉన్నాయన్న డీకే అరుణ
- పరిహారం ఇవ్వకుండా ఇళ్లు ఖాళీ చేయించడంపై సీఎంకు ప్రశ్న
- పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్

ఓట్ల చోరీ దేశ ద్రోహమే

భారత ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఎన్నికల ప్రక్రియపై ముందుగానే పథకం వేసి, దాడిని అమలు చేసినందుకు ఆయన దోషి. ఇది ఒక నేరపూరిత చర్య, అంతేకాకుండా దేశానికి, రాజ్యాంగానికి చేసిన ద్రోహం"అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ సభాపతిగా వ్యవహరించారు. మాక్ పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ అభిశంసనను ప్రజల ఓట్లను చోరీ చేయడానికి కుట్ర పన్నిన వారిపై ప్రయోగించిన 'రాజకీయ ఆయుధం'గా అభివరి?ణంచారు. విపక్ష ఎంపీలు, నాయకులు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుని నివాసంలో సమావేశం కావాల్సిన పరిస్థితి రావడం చాలా విచిత్రమని, చరిత్రలో ఇలా ఎప్పుడూ జరిగి ఉండకపోవచ్చని అన్నారు. ఇతర సంస్థలను మూసివేయడం వల్ల వేరే మార్గం లేక తాము ఇక్కడ భేటీ కావాల్సి వచ్చిందన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే తీర్మానానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఈసీపై విచారణ జరగాలని, బాధితులకు న్యాయం అందాలని తేల్చిచెప్పారు.

2024 లోక్‌సభ ఎన్నికలు 'చట్టవిరుద్ధం'

ఏ వ్యవస్థను కాపాడతానని ప్రమాణం చేశారో, అదే వ్యవస్థ వెనుక సీఈసీ దాక్కుంటున్నారని రాహుల్ విమర్శించారు. వారు ఎప్పటికీ ఇలా దాక్కోలేరని చెప్పారు. ఏదో ఒక రోజు ఈ దేశ ప్రజల ప్రతినిధులకు సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఇక పదవిలో కొనసాగలేరని పేర్కొన్నారు. ఆయన పదవిలో కొనసాగకుండా చేసేందుకు మా దగ్గర తగినన్ని ఆధారాలు ఉన్నాయని ఉద్ఘాటించారు. తాము ఈ విషయాలన్నీ బయటపెట్టిన తర్వాత కూడా ఆయనను అలాగే పదవిలో కొనసాగించాలని బీజేపీ పట్టుబడితే.. వారి అసలు ఉద్దేశం అందరికీ స్పష్టంగా తెలిసిపోతుందని అన్నారు. ఓటర్ల జాబితాల నుంచి 13.3 కోట్ల ఓట్లు తొలగించారని రాహుల్ ధ్వజమెత్తారు. ఇది దేశంలోని మొత్తం ఓటర్లలో 15 శాతానికి సమానమని తెలిపారు. 2024 ఎన్నికల్లో విజేతలకు, ప్రతిపక్షాలకు మధ్య ఉన్న ఓట్ల తేడా కేవలం 3 శాతం మాత్రమేనని గుర్తుచేశారు. అంటే 2024 లోక్‌సభ ఎన్నికలు 'చట్టవిరుద్ధం'అని స్వయంగా ఎన్నికల సంఘమే చెబుతోందని వెల్లడించారు. ప్రజల ఓట్లను తొలగించి, నిర్వహించిన ఎన్నికలు చట్టబద్ధం ఎలా అవుతాయని ప్రశ్నించారు. మాక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేతలు సోనియా గాన్ధీ, ప్రియాంక గాంధీ వాద్రా, జైరామ్ రమేశ్, కేసీ వేణుగోపాల్‌తోపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కూటమి పక్షాల ఎంపీలు, నేతలు పాల్గొన్నారు.

నిజమైన ఓటర్లకు రక్షణ కల్పించాలి

2014 నుంచి రాజకీయ అధికారాన్ని దక్కించుకోవడానికి, నిలుపుకోవడానికి అధికార పార్టీ అనేక తప్పుడు మార్గాలను అవలంబించిందని ఖర్గే విమర్శించారు. ఎంపీలను దొంగిలించారని, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేశారని, ప్రభుత్వాలను కూలదోశారని, ఎలక్టోరల్ బాండ్లు, ఈడీ, సీబీఐలను ప్రయోగించారని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఓట్లను దొంగిలిస్తున్నారని ఆక్షేపించారు. ఓట్ల దొంగతనానికి తమ వద్ద వందలాది ఉదాహరణలు ఉన్నాయని తేల్చిచెప్పారు. 2023 నాటి చట్టం కారణంగానే జ్ఞానేశ్ కుమార్ ఓట్ల దొంగతనానికి పాల్పడగలుగుతున్నారని వెల్లడించారు. 2023 డిసెంబర్‌లో 145 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి, ఈ బిల్లును ఆమోదించడం సిగ్గుచేటు, అవమానకరం అని దుయ్యబట్టారు. ఈ చట్టం కింద ఎన్నికల కమిషనర్లకు లభించే చట్టపరమైన రక్షణపై కూడా ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు. 2023 నాటి చట్టం ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కవచాన్ని కల్పిస్తోందని గుర్తుచేశారు. ఇంతటి రక్షణ కనీసం భారత రాష్ట్రపతికి లేదా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేదని అన్నారు. బీజేపీని వ్యతిరేకించే ఓటర్ల పేర్లను తొలగించడానికే ఎన్నికల సంఘం 'ఎస్ఐఆర్'ను చేపట్టిందని ఆరోపించారు. నిజమైన ఓటర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి చొరబాటుదారుల అంశాన్ని వాడుకుంటోందని చెప్పా రు.

రాష్ట్రానికి మరో తుపాను ముప్పు

అమరావతి : కోస్తాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను గాయాలు ఇంకా సలుపుతుండగానే, రాష్ట్రాన్ని మరో తుపాను ముప్పు వణికిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం శనివారం వాయుగుండంగా మారింది. ఇది మరింత బలపడి తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఇది శ్రీ విజయపురానికి 330, చెన్నైకి 1140, మచిలీపట్నానికి 1200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా ఏపీ తీరం వైపు కదులుతూ ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా, సోమవారానికి ఏపీ తీరానికి దగ్గరగా చేరుకుని తుపానుగా బలపడనుంది. మంగళవారం కావలి సమీపంలో తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఆది, సోమ, మంగళవారాల్లో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదివారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి.

మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సోమవారం అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఈ మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అదే రోజు ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తూర్పుగోదావరి, కోనసీమ, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. మంగళవారం కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలు, యానాంలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయి. బుధవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

తాగునీటి కోసం రూ.120 కోట్లు..

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

అమరావతి: రాష్ట్రంలోని 13 నగరపాలక సంస్థలు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆదివారం పోలింగ్ జరుగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. మొత్తం 99,36,014 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 11,378 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 13 నగరాల్లో ఉన్న 59,97,918 మంది ఓటర్ల కోసం 6,384 పోలింగ్ కేంద్రాలు, 79 మున్సిపాలిటీల్లో ఉన్న 39,38,096 మంది ఓటర్ల కోసం 4,994 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల బందోబస్తుకు మొత్తం 36,351 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు. 13 నగర కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఎన్నికలు ప్రకటించగా, వీటిలో 8 మున్సిపాలిటీల్లో చైర్‌పర్సన్, కౌన్సిలర్ పదవులన్నీ వివిధ పార్టీలకు ఏకగ్రీవమయ్యాయి. మరో 9 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 13 కార్పొరేషన్లు, 70 మున్సిుపాలిటీలు, నగర పంచాయతీల్లో మేయర్, చైర్‌పర్సన్, డివిజన్లు, వార్డులకు పోలింగ్ జరగనుంది. మరో 9 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డులకే పోలింగ్ జరగనుంది. మొత్తం 11,378 పోలింగ్ కేంద్రాల్లో 5,737 కేంద్రాలను సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద లోపలా బయటా వేర్వేరుగా మొత్తం 12,666 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 13 కార్పొరేషన్లలో 1,788 సమస్యాత్మక, 941 అత్యంత సమస్యాత్మక, 46 తీవ్ర సమస్యాత్మక కేంద్రాలు గుర్తించారు. 79 మున్సిపాలిటీల పరిధిలో 1,747 సమస్యాత్మక, 1,190 అత్యంత సమస్యాత్మక, 25 తీవ్ర సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాల్లో 1+2 బందోబస్తు కల్పిస్తారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో 1o4 బందోబస్తు కల్పిస్తారు. తీవ్ర సమస్యాత్మక కేంద్రాల్లో అప్పటి పరిస్థితిని బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

మూడేళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు కదలడంలేదు

తెలంగాణ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. కొడంగల్‌లోని పున్నంచంద్ లాహోటి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నెట్టెంపాడు, కల్వకుర్తి, గట్టు లిఫ్ట్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ సమస్యను పరిష్కరించి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమేంటని ఆమె మండిపడ్డారు. కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనుల కోసం ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పరిహారం ఇవ్వకుండా వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ముఖ్యమంత్రిని ఆమె నేరుగా ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల

రాప్తాడులో రక్తచరిత్ర.

అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని లక్ష్మీపైనా దాడి చేయడంతో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడివున్న విద్యార్థినులను హుటాహుటిన అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హేమంత్ జరిపిన పాశవిక దాడిలో గోపిక శరీరమంతా లోతైన గాయాలయ్యాయి. ముఖంపై లోతైన గాయం కావడంతో సగ భాగం పూర్తిగా చెక్కేసినట్లైంది. ఎడమ చేతి ఎముక భాగం విరిగింది. ఎదపై లోతైన గాయమైంది. శరీరం ముందు భాగంలో చాలా చోట్ల రంపపు గాట్లు పడ్డాయి. వీపుపై కూడా లోతైన గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దాదాపు మూడు గంటలకు పైగా వైద్యులు శ్రమించి బాలికకు శస్త్రచికిత్స చేశారు. అనంతరం శనివారం సాయంత్రం మరింత మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలం నాగలూరు గ్రామానికి చెందిన హేమంత్‌గా గుర్తించారు. తల్లిదండ్రులు లేని ఈ యువకుడు కొన్నేళ్లుగా అయ్యవారిపల్లి గ్రామంలోనే సోదరి వద్ద ఉంటూ అనంతపురం శివారులోని టమాటా మండీలో పని చేస్తున్నాడు. బాలికకు బంధువు కూడా. కొంత కాలంగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. బాలిక నిరాకరించడంతో ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన తర్వాత బైకులో పరారైన నిందితుడు హేమంత్‌ను ధర్మవరం రైల్వే గేటు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆ కుటుంబానికి తీరని శోకం..

రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన వెంకటరాముడు, నరసమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. వెంకటరాముడు ద్రాక్ష తోటల్లో కూలి పనులు, నరసమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు ఇందువర్ధన్ చదువు మానేసి కడ్డీల కార్మికుడిగా వెళ్తున్నాడు. ఒక్కగానొక్క కుమార్తె గోపికను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరుతుందన్న ఆశలతో పెంచుకుంటున్న బిడ్డపై బంధువే రాక్షసంగా దాడి చేయడం ఆ కుటుంబాన్ని తీరని వేదనలోకి నెట్టింది.

దమ్ముంటే చర్చకు రండి..

ఓటర్ల జాబితా వివాదంపై పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని, దమ్ముంటే రావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి 'పబ్లిక్ ఇంపీచ్‌మెంట్' (ప్రజా అభిశంసన) కార్యక్రమం నిర్వహించ తలపెట్టిన తరుణంలో షా ఈ వ్యాఖ్యలు చేశారు. లక్నోలో జరిగిన ఉత్తరప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. "రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌లకు నేను ఇక్కడి నుంచే సవాల్ విసురుతున్నా. ఈ అంశంపై పార్లమెంటులో చర్చకు బీజేపీ పూర్తి సిద్ధంగా ఉంది. దాచుకోవడానికి మాకేమీ లేదు" అని షా స్పష్టం చేశారు. పార్లమెంటును సజావుగా నడవనీయకుండా రచ్చ చేస్తూ, వీధుల్లో నిరసనలు చేయడానికి ప్రతిపక్షాలు ఇష్టపడుతున్నాయని ఆయన విమర్శించారు. హరియాణా, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో బీజేపీ గెలిచిన తర్వాత, ఓటమిని తట్టుకోలేక ప్రతిపక్షాలు అంపైర్‌పైనే ఆరోపణలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతీకాత్మక 'ప్రజా అభిశంసన' కార్యక్రమాన్ని ఇండియా కూటమి ఈరోజు (శనివారం) నిర్వహిస్తోంది. వాస్తవానికి శుక్రవారం జరగాల్సి ఉన్నా, ఢిల్లీలో వర్షం కారణంగా ఇది శనివారానికి వాయిదా పడింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరగనున్న ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించనున్నారు. ఖర్గే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టనుండగా, రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేస్తారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుంచి సుమారు 13 కోట్ల పేర్లను తొలగించారని ప్రతిపక్షాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి.

'మియాపూర్' భూముల వ్యవహారంలో విజయం కేసీఆర్ సర్కార్‌దే

తీసుకున్నదని రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడారని హరీశ్ మండిపడ్డారు.కానీ ప్రసాద్‌కు చెందిన భూముల వ్యవహారాన్ని మొదట బయపెట్టింది 'నమస్తే తెలంగాణ' అని స్పష్టంచేశారు. దీనిపై కేసీఆర్ వెంట నే స్పందించి సీఐడీ విచారణకు ఆదేశించారని, ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో ప్రసాద్ అన్నతోసహా పార్థసారథి, పీవీఎస్ శర్మ, శ్రీనివాస్‌రావును అరెస్ట్ చేసి జైలుకు పంపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఈ భూముల కు సంబంధించి లాయర్ వైద్యనాథన్‌ను ని యమించి, డాక్టర్ ప్రసాద్‌కు చెందిన ట్రినిట్రి కంపెనీపై హైకోర్టు, సుప్రీంకోర్టులో కొట్లాడి గెలిచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇటీవల ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు కూడా గతంలో కేసీఆర్ సర్కార్ తెచ్చిన ఆర్డర్ ఆధారంగానేనని గుర్తుచేశారు. '23 సం వత్సరాలుగా జరుగుతున్న ఈ కేసులో రాష్ట్రం ఏర్పడకముందు దాదాపు 86 సార్లు సుప్రీంకోర్టులో ఈ కేసు హియరింగ్‌కు వచ్చింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 95 సార్లు హియరింగ్‌కు వచ్చింది. 10-07-2017న జరిగిన హియరింగ్‌కు సీఎస్ వైద్యనాథన్ హాజరయ్యారు. 6-03-2019న, 14-03-2019 న ఇలా 86 సార్లు హియరింగ్‌కు సీఎస్ వైద్యనాథన్ హాజరయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించి ఈ కేసును తుది దశకు తెచ్చారు. కేవలం తీర్పు మాత్రమే మిగిలి ఉన్నది' అని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయంతోనే 'జాగీర్ అబాలిషన్ యాక్ట్-2016'కు చట్టబద్ధత కల్పిస్తూ జూన్ 1, 2016 నాడు జీవో 45ను జారీ చేశామని గుర్తుచేశారు. దీని ఆధారంగానే ప్రసాద్‌కు చెందిన భూములను ప్రభుత్వం పరం చేయగలిగామని, ఆ తర్వాత ట్రినిట్రి జడ్జిమెట్ ఆధారంగా సుప్రీంకోర్టులో 86 సార్లు వాదనలు వినిపించి మియాపూర్ కేసును తుదిదశకు తీసుకొచ్చామని తెలిపారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత మూడేండ్లలో కేవలం 11 వాదనలు మాత్రమే జరిగాయన్నారు. ఈ పోలికను చూస్తే రెండు ప్రభుత్వాల నిబద్ధత అర్థమవుతున్నదని స్పష్టంచేశారు. ఆ తీర్పు వచ్చిన వెంటనే చట్టబద్ధమైన నిబంధనలను పాటించకుండా అక్రమారులు ఏకపక్షంగా భూపాలపల్లిలోని ఆ 106 ఎకరాల భూమిలోకి ప్రవేశించి, భారీ యంత్రాలతో నిర్మాణ పనులు మొదలుపెట్టారన్నారు. ఈ ఆక్రమణలపై కేసీఆర్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఫారెస్ట్, రెవెన్యూ చట్టాల ఉల్లంఘనలతోపాటు క్రిమినల్ ట్రెస్‌పాసింగ్ కేసులు నమోదు చేయించిందని తెలిపారు. మూడు జేసీబీలు, ట్రాక్టర్లు, ట్రైలర్లను సీజ్ చేయడంతోపాటు రఘుపతిరెడ్డి, తిరుపతి నా యక్, ప్రవీణ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపామ ని చెప్పారు. ఆ భూములను ప్రైవేట్ వ్యక్తులకే వదిలేసే ఆలోచన ఉంటే, వారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు ఎందుకు పంపుతుందో రేవంత్ సమాధానం చెప్పాలని నిలదీశారు.

రేవంత్‌రెడ్డి క్రెడిట్ చోరీ

హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు వచ్చిన ఒక నెల వ్యవధిలోనే, అంటే 2021 మేలో బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ 6937/2021) దాఖలు చేసిందని హరీశ్ పేరొన్నారు. సీనియర్ న్యా యవాది సీఎస్ వైద్యనాథన్‌ను నియమించి, 2021 నుంచి 2024 వరకు మూడేండ్లపాటు సుప్రీంకోర్టులో రాజీలేని పోరాటం సాగించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చిన మూడు నెలలకే, 2024 ఏప్రిల్ 18న సుప్రీంకోర్టు తుది తీర్పు వెలువడిందన్నారు. రేవంత్‌రెడ్డి అంతా తానే చేసినట్లు ప్రచారం చేసుకోవడం పచ్చి 'క్రెడిట్ చోరీ' అని దుయ్యబట్టారు. ఐఎంజీ భారత్ భూముల కుంభకోణాన్ని హరీశ్ ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు, శంషాబాద్ మామిడిపల్లిలోని 450 ఎకరాలు కలిపి మొత్తం 850 ఎకరాల విలువైన భూమిని ఎక రా కేవలం రూ.50 వేల చొప్పున ఐఎంజీ బిల్లీరావుకు కట్టబెట్టింది ఎవరో చెప్పాలని నిలదీశారు. నాటి సీఎం చంద్రబాబు ఆ పాపానికి ఒడిగడితే, అదే టీడీపీ ముఠాలో రేవంత్‌రెడ్డి కూడా క్రియాశీలక భాగస్వామిగా లేరా? అని ప్రశ్నించారు. రాష్ట్రం సిద్ధించి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ 850 ఎకరాల్లో ఒక గుంట కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించామని చెప్పారు. ప్రముఖ న్యాయవాదులతో తొమ్మిదేండ్లపాటు హైకోర్టులో న్యాయపోరాటం జరిపి కేసును తుది దశకు చేర్చింది ము మ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వమేనని వివరించారు. రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మూడు నెలలకే, అంటే 2024 మార్చి 7న ఐఎంజీ కేసులో హైకోర్టు తుది తీర్పు వెలువడిందని పేరొన్నారు. అప్పటికి రాష్ట్రంలో న్యాయశాఖ మంత్రి ఎవరో కూడా తెలియని అయోమయ పరిస్థితులున్నాయన్నారు.

TGTEL/26/A6221
తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
TOLE VELUGGU JATIYAPATRIKA
యాదాద్రి భువనగిరి ఆదివారం 01 నవంబర్ 2026

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగించాలి

- దేశ ఐక్యత, సమగ్రతకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం

- బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

తొలివెలుగు, గడ్డిఅన్నారం: భారతదేశ తొలి హోంమంత్రి, మాజీ ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో సరస్వతీ నగర్ చౌరస్తాలో శనివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ముఖ్యంగా నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో, రజాకార్ల అరాచకాలకు ముగింపు పలకడంలో ఆయన చూపిన ధైర్యసాహసాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం పటేల్ అనుసరించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిలుకూరి రాంరెడ్డి, నాయకులు మురళి, ఓంకార్, బద్దం వివేకానందరెడ్డి, సుబ్బారెడ్డి, భీష్మాచారి, బాబు చౌదరి, సతీష్ చారీ, కిరణ్ మై, దేవి, వివేక్ చారీ, శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

ం దేశ సమైక్యతకు పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం ం కళ్లెం నవజీవన్ రెడ్డి

తొలివెలుగు, హయత్‌నగర్: భారత ఉక్కు మనిషి, స్వతంత్ర భారత తొలి ఉపప్రధాని, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యత, సమగ్రత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని హైకోర్టు కాలనీ డివిజన్‌లో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మర్రి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళ్లెం నవజీవన్ రెడ్డి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి భారత సమైక్యతకు బలమైన పునాది వేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా మహిళా నాయకురాలు పార్వతి, మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు గీత, సీనియర్ నాయకులు గోవిందాచారి, శ్రీధర్ రెడ్డి, వెంకన్న, తిరుమలేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, విష్ణు, రీతిక్, మహిళా నాయకురాలు సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి

ం నేతాజీ చౌరస్తా వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల రాస్తారోకో

ం దుర్వాసన, పొగతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామంటూ ఆవేదన

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: మోడల్ స్కూల్ సమీపంలోని డంపింగ్ యార్డును వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని నేతాజీ చౌరస్తా వద్ద మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ సాయికిరణ్ మాట్లాడుతూ.. సుమారు 400 నుంచి 500 మంది విద్యార్థులు చదువుకునే పాఠశాల పక్కనే డంపింగ్ యార్డు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పాటు, చెత్తను తగలబెట్టడం వల్ల వ్యాపిస్తున్న పొగతో విద్యార్థులు శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి చదువుకోవాల్సి వస్తోందన్నారు. సుమారు గంటపాటు కొనసాగిన రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. డంపింగ్ యార్డును తక్షణమే తరలించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు రాయబండి సిద్ధు, నాయకులు వినయ్, రామ్‌చరణ్, మణికంఠ, ఓంసాయి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణలో అక్రమాలను సహించేది లేదు

ం రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవు

ం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తొలివెలుగు, ఇబ్రహీంపట్నం: భూసేకరణ ప్రక్రియలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. యాచారం మండలం మొండిగౌరెల్లిలో భూసేకరణలో భాగంగా ప్రభుత్వ భూముల్లో సాగు, కబ్జాలో ఉన్న బాధిత రైతులకు ఎకరాకు రూ.30 లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు 121 గజాల చొప్పున ఇంటి స్థలాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్‌లో మొండిగౌరెల్లికి చెందిన 19 మంది బాధిత రైతులకు తొలి విడతగా 26.36 ఎకరాల భూమికి సంబంధించి రూ.8.7 కోట్ల నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటుకు 20 వేల ఎకరాల భూమిని సేకరించి, రైతులకు నామమాత్రపు పరిహారం అందిస్తూ వారి ప్రయోజనాలను దెబ్బతీసిందని ఆరోపించారు. విషపూరిత కాలుష్యానికి కారణమయ్యే ఫార్మా పరిశ్రమ ప్రతిపాదనను రద్దు చేసి ప్రజలకు మేలు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, మొండిగౌరెల్లిలో సేకరిస్తున్న 677 ఎకరాల భూమిలో విమానాల విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి నిజాయితీగా విధులు నిర్వహించే అధికారని పేర్కొంటూ, భూసేకరణలో ఎక్కడైనా అన్యాయం జరిగినట్లు గుర్తిస్తే నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మొండిగౌరెల్లిలోని 677 ఎకరాల్లో 433 ఎకరాల భూమికి సంబంధించి ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలిపారు. మరో 177 ఎకరాల భూమికి సంబంధించి కుటుంబ వివాదాలు, ఇతర అభ్యంతరాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించిన అనంతరం విడతల వారీగా బాధిత రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్, సర్పంచ్ రమాదేవి, ఇబ్రహీంపట్నం, యాచారం ఎస్‌హెచ్‌ఓలు మహేందర్‌రెడ్డి, నందీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ వచ్చినా మానవ నైపుణ్యాలకు ఎప్పటికీ డిమాండ్

ం 150కి పైగా కంపెనీలతో టీకేఆర్ మెగా జాబ్ మేళా--2026

ం జయేష్ రంజన్, ఐఏఎస్

తొలివెలుగు, మీర్‌పేట్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అందుబాటులోకి వచ్చినంత మాత్రాన మానవ వనరుల అవసరం తగ్గిపోతుందనడం అపోహ మాత్రమేనని తెలంగాణ ప్రభుత్వ ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఐఏఎస్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా మానవ నైపుణ్యాలు, సృజనాత్మకత, ప్రతిభకు ఎప్పటికీ ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మీర్‌పేట్‌లోని టీకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) ప్రాంగణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా--2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌బీఏ టైర్--1, నాక్ ఏ+ గుర్తింపు పొందిన ఈ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో 150కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. యువత తమ భవిష్యత్తు కోసం ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడంతో పాటు బృందంతో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఇతరుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినప్పుడే సంస్థలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఉద్యోగ మార్కెట్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని, యువత తమ ప్రతిభను నిరూపించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకే వేదికపైకి 150కి పైగా కంపెనీలను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న టీకేఆర్ విద్యాసంస్థ యాజమాన్యాన్ని అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్తే మా లక్ష్యం:

టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అందుబాటులోకి వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులోనూ విద్యార్థుల ఉపాధి కోసం ఇలాంటి భారీ జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ టి. హరినాథ్ రెడ్డి, కోశాధికారి టి. అమర్‌నాథ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రామస్వామిరెడ్డి, జాబ్ మేళా కన్వీనర్ ఆర్. అయ్యప్ప శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: జడ్జి జి. సబిత

- వలిగొండ మాంటిస్సోరి హైస్కూల్‌లో 'సురక్ష బచ్‌పన్ అభియాన్' సదస్సు

- పోక్సో చట్టం, సామాజిక మాధ్యమాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

తొలివెలుగు, వలిగొండ : బాలల హక్కుల పరిరక్షణ, భద్రతతో పాటు వారిపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. సబిత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వలిగొండలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో శనివారం 'సురక్ష బచ్‌పన్ అభియాన్--బాలల హక్కులు, పోక్సో చట్టం--2012' అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి సబిత మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. అత్యవసర సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ 112, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కునూరు శ్రీనివాస్, సోమ సతీష్ రెడ్డి, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్త కురిమేటి యాదయ్య, పాఠశాల డైరెక్టర్ బాలరాజు, ప్రిన్సిపల్ థామస్ అబ్రహం, ఎస్సై ఎ. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గేది లేదు

ఢిల్లీ రాంలీలా మైదాన మహాధర్నాకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు

డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

తొలివెలుగు, బడంగ్‌పేట్: ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధ హక్కులు, ప్రజల ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా నవంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించనున్న మహాధర్నాకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళు న్నాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ), ఇండియా కూటమి పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ మహాధర్నాకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి వెళ్లకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక రైళ్ల కేటాయింపులో ఆటంకాలు సృష్టించిందని ఆమె ఆరోపించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఢిల్లీకి చేరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

800 మందికి పైగా కాంగ్రెస్ శ్రేణుల పయనం:

కేంద్రం నుంచి ఎదురైన అడ్డంకులను అధిగమిస్తూ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులు, రైళ్ల ద్వారా ఢిల్లీకి బయలుదేరారు. పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం విమానాల్లో ఢిల్లీకి చేరుకున్నట్లు పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. షాద్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్, చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కలిపి జిల్లా నుంచి 800 మందికి పైగా మహాధర్నాకు తరలివెళ్లినట్లు వెల్లడించారు.

ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ సత్తా చాటుతాం:

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు రాంలీలా మైదానంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కృషి చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యాన్ని దేశ రాజధానిలో చాటిచెబుతామని చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు.

వర్షార్పణమైన ధాన్యం.. దిక్కుతోచని స్థితిలో రైతన్న

ం తడిసిన ప్రతి గింజనూ మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ం చిట్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

తొలివెలుగు, చిట్యాల: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. చిట్యాల పట్టణంలోని ఉరుమడ్ల రోడ్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయిన ధాన్యం రాశులను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతుల ధాన్యం వర్షానికి తడిసిపోయిందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15 నుంచి 20 రోజులు గడుస్తున్నా కాంటాలు వేయకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు కొరవడిందన్నారు. రైతులు నెలల తరబడి కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం పేరుతో రైతులకు అన్యాయం చేయకుండా ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, వెంటనే కాంటాలు వేసి ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్ ఎస్.కె. షబానా అజీముద్దీన్, బీఆర్ఎస్ నాయకులు జమాన్ల శ్రీనివాస్‌రెడ్డి, బొబ్బలి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంది పంటలో చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- మొగ్గ దశ నుంచే పంటను పర్యవేక్షించాలి

- సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు సాధ్యం: వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ కుమార్

తొలివెలుగు, ఆత్మకూరు (ఎం): కంది పంటలో చీడపీడల నివారణపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ సూచించారు. ప్రస్తుతం కంది పంట మొగ్గ నుంచి పూత దశకు చేరుకుంటున్న నేపథ్యంలో చీడపీడల ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాత లోటు ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ ఈ వానాకాలంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించింది. జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా డబ్ల్యూ.ఆర్.జీఈ-255, పి.ఆర్.జీ-176 రకాల కంది విత్తనాలను సబ్సిడీపై అందించడంతో రైతులు కంది సాగుపై ఆసక్తి చూపారు. ఈ క్రమంలో పంటను ఆశించే చీడపీడలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

మారుకా మచ్చల పురుగుతో నష్టం:

మారుకా మచ్చల పురుగు మొగ్గలు, పూతలను జాలంలా అల్లి లోపల ఉండి తినడం వల్ల పూతలు ఎండిపోవడం, మొగ్గలు దెబ్బతినడం జరుగుతుందని తెలిపారు. పూత ప్రారంభ దశలో వేపనూనె పిచికారీ చేయాలని, పురుగు ఉధృతిని బట్టి వ్యవసాయశాఖ సిఫారసు చేసిన మందులను వినియోగించాలని సూచించారు.

శనగ పచ్చ పురుగు నివారణకు చర్యలు:

శనగ పచ్చ పురుగు పూత, లేత కాయలను ఆశించి గింజలను దెబ్బతీస్తుందని వివరించారు. దీని నివారణకు ఎకరాకు 12 నుంచి 15 పక్షి స్థావరాలు, 10 నుంచి 12 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు మాత్రమే సిఫారసు చేసిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

కాయ ఈగ పట్ల అప్రమత్తత అవసరం:

కాయ ఈగ లార్వాలు కాయల లోపలికి చేరి గింజలను దెబ్బతీస్తాయని, ముఖ్యంగా బెట్ట పరిస్థితుల్లో వీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కాయలు ఏర్పడే దశ నుంచే పంటను నిశితంగా పరిశీలిస్తూ తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

సమగ్ర యాజమాన్యంతోనే అధిక దిగుబడులు:

రైతులు వారానికి కనీసం రెండుసార్లు పొలాలను పరిశీలించి మొగ్గలు, ఆకులు, పూత, లేత కాయలపై చీడపీడల లక్షణాలను గుర్తించాలని అశోక్ కుమార్ సూచించారు. పురుగుల గుడ్లు, లార్వాలను గుర్తించి నాశనం చేయడంతో పాటు పక్షి స్థావరాలు, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగుల ఉధృతి ఆర్థిక నష్టపరిధి దాటిన తర్వాతే వ్యవసాయశాఖ సిఫారసు చేసిన రసాయన మందులను పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. మొగ్గ, పూత దశలో పంటకు అవసరమైన మేరకు నేలలో తేమ ఉండేలా చూసుకోవాలని, అధికంగా నీరు పెట్టకూడదని సూచించారు. అధిక తేమ వల్ల పూత రాలిపోయే ప్రమాదం ఉందన్నారు. చీడపీడల లక్షణాలు కనిపించిన వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని కోరారు. ముందస్తు జాగ్రత్తలు, సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులతో పెట్టుబడిని కాపాడుకోవడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

ముప్పిడి అశోక్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారి

ఘనంగా సీడీపీఓ వెంకటరమణ ఉద్యోగ విరమణ వేడుక

ం మహిళా శిశు సంక్షేమానికి ఆమె చేసిన సేవలు అభినందనీయం

ం జిల్లా సంక్షేమ అధికారి చిలుకూరు శ్రీనివాసరావు

తొలివెలుగు, రామన్నపేట: సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ మహిళా, శిశు సంక్షేమానికి విశేష కృషి చేసిన రామన్నపేట సీడీపీఓ ఉత్తంగి వెంకటరమణ పదవీ విరమణ వేడుక శనివారం మండల కేంద్రంలోని జేపీ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ ఆత్మీయ వీడ్కోలు సభలో అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి చిలుకూరు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెంకటరమణ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో అభినందనీయ సేవలు అందించారన్నారు. అనంతరం భువనగిరి, ఆలేరు, మోత్కూరు సీడీపీఓలు శైలజ, స్వరాజ్యం, నాజీ తదితరులు మాట్లాడుతూ వెంకటరమణ పనితీరు తోటి ఉద్యోగులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణను అధికారులు, సహచర సిబ్బంది శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వెంకటరమణ మాట్లాడుతూ తన ఉద్యోగ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి.. ఇందిరాగాంధీ

ం ఇందిరమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

ం ఎమ్మెల్యే వేముల వీరేశం, గుత్తా అమిత్ రెడ్డి

ం చిట్యాలలో ఘనంగా పూర్వ ప్రధాని వర్ధంతి వేడుకలు



తొలివెలుగు, చిట్యాల: దేశ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిస్తూ పేదల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిట్యాలలో శనివారం డీసీసీ అధికార ప్రతినిధి పోకల దేవదాసు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వేముల వీరేశం, గుత్తా అమిత్ రెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ పేదల సంక్షేమానికి పటిష్ఠమైన పునాదులు వేశారని, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో ముందుకు సాగాలని, పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, నాయకులు పాటి నర్సిరెడ్డి, పిశాటి భీష్మారెడ్డి, బెల్లి సత్తయ్య, ఇబ్రహీం, పోకల అశోక్, చోల్లేటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ధాన్యం కొనుగోళ్లు

ం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సహించేది లేదు

ం ప్రభుత్వ విప్ వేముల వీరేశం

తొలివెలుగు, చిట్యాల: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులకు సూచించారు. రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన పీఏసీఎస్-ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా నిరంతరాయంగా ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్ గౌడ్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నర్ర వినోద్ మోహన్ రెడ్డి, ఉరుమడ్ల సర్పంచ్ సాగర్ల భానుశ్రీ బిక్షం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు బుద్ధుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, డీసీసీ అధికార ప్రతినిధి పోకల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఎంపికలో సర్పంచులకు సమాచారం ఇవ్వాలి

ం మండల సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రతిపక్ష సర్పంచులు

ం ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి: ప్రత్యేక అధికారి బి. సురేష్ కుమార్

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధులైన సర్పంచులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని మండల ప్రత్యేక అధికారి బి. సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిబ్లక్‌పల్లి సర్పంచ్ ఆర్ల కావ్య వెంకటేష్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల జాబితా తయారీలో ప్రతిపక్ష పార్టీ సర్పంచులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని అధికారులను నిలదీశారు. ప్రభుత్వ పథకాలు ఏ ఒక్క పార్టీకో చెందినవి కావని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ప్రత్యేక అధికారి.. ఇకపై ప్రతి సంక్షేమ పథకంలో సర్పంచులకు కచ్చితంగా సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా గ్రామాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నీటి పొదుపు, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయ, పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్య, సర్పంచులు సామ రవీందర్ రెడ్డి, పెరమండ్ల మహాలక్ష్మి దానయ్య, చిలువేరు లక్ష్మయ్య, బొక్క మల్లారెడ్డి, గోరుగంటి సువర్ణ, కర్నాటి వరలక్ష్మి, ఈట్టమని గీత, మండల వైద్యాధికారి శ్రీవాణి, పశు వైద్యాధికారి భోగ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ం పభుత్వంలో విలీనం చేయాలని ఉపాధ్యాయుల డిమాండ్

ం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శనివారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మోడల్ స్కూళ్లను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా అవుట్‌సోర్సింగ్, సావిత్రీబాయి పూలే అర్బన్ రెసిడెన్షియల్ (ఎస్‌బీఎఫ్) ఉపాధ్యాయుల వేతనాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కరీముల్లా, అధ్యాపకులు పాండాల మహేష్, మధు, ప్రకాష్, వెంకన్న, సృజన, హరీష్, లీల, పూర్ణయ్య, జ్యోతి, సుజాత, స్వప్న, రామ్‌కుమార్, కరుణాకర్, అన్వర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న మేడారానికి 'మౌలిక' నిధులు

ం రూ.6 లక్షలతో బాత్రూంలు, ఇంకుడు గుంతల నిర్మాణం

ం భక్తుల కష్టాలకు తీరనున్న పరిష్కారం

ం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ సంపత్

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం చిన్న మేడారం వద్ద భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం రూ.6 లక్షల నిధులు మంజూరైనట్లు బూరుగుపల్లి సర్పంచ్, జాతర నిర్వాహకుడు చింతల సంపత్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిన్న మేడారం వద్ద బాత్రూంల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు కోసం ఈ నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. ?ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయని సర్పంచ్ పేర్కొన్నారు. బాత్రూంల సౌకర్యం అందుబాటులోకి వస్తే జాతర సమయాల్లోనే కాక నిత్యం వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలుగుతాయని, ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. చిన్న మేడారం అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సింగారంలో ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు

ం సర్పంచ్, వార్డు సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు

ం ఇళ్లు, దుకాణాల్లో క్షుణ్ణంగా సోదాలు

ం అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు గుర్తించలేదు: ఎక్సైజ్ సీఐ నాగలత

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం సింగారం గ్రామంలో అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆలేరు ఎక్సైజ్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆలేరు ఎక్సైజ్ సీఐ జి. నాగలత ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో పలువురి ఇళ్లు, దుకాణాల్లో సోదాలు చేపట్టారు. గ్రామంలో అక్రమ మద్యం కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నాగలత మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలోని పలువురి ఇళ్లతో పాటు దుకాణాల్లో సోదాలు నిర్వహించి అక్రమ మద్యం నిల్వలు ఉన్నాయా, అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎక్కడా అక్రమ మద్యం నిల్వలు, విక్రయాలు గుర్తించలేదని సీఐ స్పష్టం చేశారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. ఎక్కడైనా అనధికారికంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించి తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో అక్రమ మద్యం కార్యకలాపాలపై వచ్చిన ఫిర్యాదుతో ఎక్సైజ్ అధికారులు నేరుగా తనిఖీలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

ం పటేల్ సేవలు దేశానికి మార్గదర్శకం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్

ం హాజరైన మండల అధ్యక్షుడు మేకల రమేష్, పార్టీ శ్రేణులు

తొలివెలుగు, రాజాపేట: స్వతంత్ర భారత దేశ సమైక్యతకు, సమగ్రతకు పునాదులు వేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు అనన్యసామాన్యమని బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ కొనియాడారు. రాజాపేట మండల బిజేపీ ఆధ్వర్యంలో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు మేకల రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పటేల్, గాంధీజీల చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఊట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. వందలాది సంస్థానాలను భారత్‌లో విలీనం చేసి అఖండ భారతావనిని ఆవిష్కరించిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. ఆయన చూపిన దేశభక్తి, పట్టుదల నేటి యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల బీజేపీ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలి

ం కుర్రారంలో ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామసభ

ం హాజరైన ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి

తొలివెలుగు, రాజాపేట: రాబోయే కాలంలో ఎదురయ్యే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి కోరారు. శనివారం రాజాపేట మండలం కుర్రారం గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ బొడ్డు భాస్కర్ అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. వాతావరణ మార్పులతో రాబోయే రోజుల్లో వర్షాలు తగ్గే సూచనలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం (విబిజి రాంజీ) ద్వారా ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచుకోవచ్చని తెలిపారు. అధికారులు, రైతులు, మహిళలకు పంటల సాగు, నీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మహేష్, ఇరిగేషన్ ఏఈ అంజు, వైద్యాధికారి భీమా నాయక్, ఈసీ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు ఎర్రగుంట ప్రభాకర్, మేడి స్వరూప, గ్రామ ప్రముఖులు బాలచంద్రయ్య, బూరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బూర్గుపల్లి, పారుపల్లి గ్రామాల్లో సర్పంచులు చింతల సంపత్, మోత్కుపల్లి జ్యోతిల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు.

కమ్యూనిస్టులే ఎప్పటికీ పేదల పక్షం

- కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ నిరంతర పోరాటం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుర్ల లింగం

తొలివెలుగు, రాజాపేట : కమ్యూనిస్టులు ఎప్పటికీ పేదలు, కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధన కోసం పోరాటాలు సాగిస్తారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుర్ల లింగం అన్నారు. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిగుర్ల లింగం మాట్లాడుతూ.. భారత కార్మిక ఉద్యమ చరిత్రలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. దేశ పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాలంటే వారి సమస్యలపై నిరంతర పోరాటం అవసరమని పేర్కొన్నారు. గతంలో కార్మికులు సుదీర్ఘ పని గంటలు, తక్కువ వేతనాలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, కనీస సౌకర్యాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి వారి హక్కుల కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిన ఘనత ఏఐటీయూసీకి దక్కుతుందన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు సంఘటిత పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని వివరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఏఐటీయూసీ తన పోరాట పంథాను కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మూలపోచయ్య, దయ్యాల సిద్ధులు, కొయ్య బాబు, యమ్మ బాలరాజు, బొద్దుల మహేందర్, బండి సాయిలు, రవి, కాలే నరసింహులు, వీరయ్య, జూకంటి చంద్రయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

ం బాహ్మణ వెల్లెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

ం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలి

తొలివెలుగు, నార్కెట్‌పల్లి:ూా రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. నార్కెట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద తగినన్ని గోనె సంచులు, తార్పాలిన్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ఐకేపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పేదింటి పెళ్లిళ్లకు 'కల్యాణ' హస్తం

ం రాజాపేటలో 14 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ం చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

తొలివెలుగు, రాజాపేట: పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. రాజాపేట మండల పరిధిలోని 14 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఆడపిల్లల వివాహాలు జరిపించేందుకు ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవికిరణ్, రేణిగుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, కుర్రారం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రగుంట సునీల్, రేగు సిద్ధులు, మేడిశెట్టి సురేందర్, బైరా పాండు, రావుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు ఆదర్శనీయం: చైర్మన్ నమిల మహేందర్ గౌడ్

- రాజాపేటలో ఘనంగా పూర్వ ప్రధాని వర్ధంతి వేడుకలు

తొలివెలుగు, రాజాపేట: దేశానికి మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ చేసిన సేవలు అమోఘమని, ఆమె బాట అందరికీ ఆదర్శనీయమని రేణికుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ అన్నారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు పిండికూర మహేష్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'గరీబీ హఠావో' నినాదంతో పేదరిక నిర్మూలనకు అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఇందిరా గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, డాక్టర్ చింతల రవి, కాంగ్రెస్ మండల నాయకులు ఐరేని నవీన్ కుమార్, రావుల హరిబాబు, బైర పాండు, రేగు సిద్ధులు, రాంగళ్ల కృష్ణ, గుర్రం శ్రవణ్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లెన స్వామి, పొట్టబత్తిని వెంకటేశం, నరిశెట్టి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులకు సర్పంచ్ నోటీసులు

ం గ్రామంలో మద్యం విక్రయాలు, సిట్టింగ్‌లు నిర్వహించరాదని ఆదేశం

ం నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

తొలివెలుగు, రాజాపేట : గ్రామంలో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలను అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా రాజాపేట మండలం బేగంపేట గ్రామ పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. పాలకవర్గ తీర్మానం మేరకు గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారికి సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని దుకాణాల్లో మద్యం విక్రయాలు జరపడం, మద్యం సేవించేందుకు సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం నిషేధమని స్పష్టం చేశారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు, గొడవలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మద్యం కారణంగా యువత చెడు అలవాట్లకు బానిసలయ్యే ప్రమాదం ఉందని, గ్రామంలో యువకుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యలను నివారించడంతో పాటు గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ తీర్మానాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి, బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. జారీ చేసిన నోటీసులను పట్టించుకోకుండా నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు.



ude: 17.707549
itude: 78.889084
tion: 468.33±7.45 m
racy: 11.89 m
10-31-2026 09:27

DATE: 30/10/2026

బేగంపేట గ్రమ పంచాయితి నోటీసు

శ్రీ బేగంపేట గ్రమ సర్పంచ్ ఇండ్ల అనుష భర్త సుమన్ గ్రమము బేగంపేట, గారి అద్యక్షతన పలక వర్గ తిర్మానము ప్రకారము బేగంపేట గ్రమములో మీరు అనగా గారు మీయొక్క దుకాణములో మద్యానికి సంబదిచినవి అమ్మినచో మీయొక్క ఇంటి లోపల గాని ఎలాంటి సిట్టింగ్ లు కూర్చోబెట్టి మద్యం తిస్కోవడం వంటివి చేయవద్దని మీకు తెలియ పర్చుచున్నాము, దాని వలన ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశాలు ఎక్కువగా వున్నాయి ,కావున మీకు మా ద్వారా మీకు ఇట్టి నోటిసు పంపు చున్నాము .అని తెలియ పర్చుచున్నాము

నోట్ : నోటీసును తిరస్కరించినచో మీపై చట్టపరమైన చర్యలు తిసుకోబడతాయని తెలుపనైనది

ఇట్లు

బేగంపేట సర్పంచ్

I. Anusha

సర్పంచ్

గ్రామ పంచాయితి - బేగంపేట

ప్రతి గింజనూ మద్దతు ధరకే కొనుగోలు చేస్తాం: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

ం అయిటిపాములలో ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ం రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగొద్దని అధికారులకు ఆదేశం

తొలివెలుగు, కట్టంగూరు: రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ వేముల వీరేశం స్పష్టం చేశారు. నకిరేకల్ నియోజకవర్గం కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాల వద్ద తగినన్ని గోనె సంచులు, తార్పాలిన్లు, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామానికి చెందిన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

- అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థుల ఆగ్రహం

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హాస్టల్ మంజూరై మూడు నెలలు గడుస్తున్నా అధికారులు ప్రారంభించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చౌటుప్పల్‌కు వచ్చే పేద విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారని, వసతి గృహాన్ని అందుబాటులోకి తెస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతులు కల్పించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బండారి విక్రమ్, వరుణ్ తేజ్, సుర్వి అరవింద్, శివ, వంశీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోరీ'పై నిరసన.. రాహుల్, రేవంత్‌పై కేటీఆర్ ఘాటు సెటైర్లు

ఢిల్లీలో 'ఓట్ చోరీ' నిరసనపై కాంగ్రెస్‌ను విమర్శించిన కేటీఆర్

'ఓట్ ఫర్ నోట్ చోర్'తో రాహుల్ గాంధీ ధర్నా చేస్తున్నారంటూ సెటైర్

10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశాన్ని ప్రస్తావన

ఎన్నికల కమిషనర్ రాజీనామా కోరుతూ విపక్షాల 'చలో ఢిల్లీ'

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు (కేటీఆర్) ధ్వజమెత్తారు. 'ఓట్ల చోరీ' ఆరోపణలపై నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి తలపెట్టిన నిరసనను ఉద్దేశించి ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "'ఓటుకు నోటు దొంగ'తో కలిసి 'ఎమ్మెల్యేల దొంగ' ఢిల్లీలో 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా నిరసన చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించిన రాహుల్ గాంధీ, ఇప్పుడు 'ఓటుకు నోటు' కేసులో నిందితుడైన రేవంత్ రెడ్డితో కలిసి దేశంలో ఓట్ల దొంగతనం గురించి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. "భారత ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి" అంటూ తన పోస్ట్‌ను ముగించారు. ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలో నిరసన చేపట్టనున్నాయి. కన్నాట్ ప్లేస్ నుంచి రాంలీలా మైదానం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రాహుల్ గాంధీ ప్రకటించారు. అయితే, ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిరసనపై కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. గందరగోళం సృష్టించే బదులు గాంధేయ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలపాలని సూచించారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వంశీధర్‌రెడ్డికి సన్మానం

- శుభాకాంక్షలు తెలిపిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్

తొలివెలుగు, చౌటుప్పల్: కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దండు మల్కాపూర్ గ్రామానికి చెందిన పక్కీరు వంశీధర్‌రెడ్డిని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్ ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. శనివారం గ్రామంలో వంశీధర్‌రెడ్డికి శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సుక్క రవీందర్, ఉపసర్పంచ్ మీసాల నరసింహ, వార్డు సభ్యులు ఈడ్దుల ఇంద్రసేన యాదవ్, అత్తపురం సంతోష అంజిరెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుర్ర శివకుమార్‌గౌడ్, ఆలయ డైరెక్టర్లు బోంతల యువరాజు, దౌడి లింగస్వామి, నాయకులు దౌడి వెంకటేష్, గాలబ్ ఖాన్, బాబా, చేపురి మహేష్, సుంకరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్స్ హాస్టల్‌లో అండాలు సేకరించే దందా..!

ఎల్బీనగర్, అక్టోబర్ 31 : అది పేరుకే ఉమెన్స్ హాస్టల్.. అక్కడ జరుగుతోంది మహిళల నుంచి అండాలను సేకరించే పనులు.. డబ్బు ఆశ చూపి ఉత్తర రాష్ట్రాలకు చెందిన మహిళలను రప్పించి హాస్టల్స్‌లో ఉంచి వారి అండాలను సేకరించి ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయిస్తున్నారు. పోలీసులు ముఠా గుట్టును రట్టుచేసి.. నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం సమీపం, వెంకటేశ్వర కాలనీలోని శెట్టి ఉమెన్స్ హాస్టల్‌ను దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. ఉత్తర రాష్ట్రాలకు చెందిన యువతులు, మహిళలను తీసుకువచ్చి హాస్టల్‌లో ఉంచి.. వారి నుంచి అండాలను సేకరించి.. ఫెర్టిలిటీ కేంద్రాలకు విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఉమెన్స్ హాస్టల్‌పై దాడి.. అందులో ఉన్న 15 మంది యువతులను, నిర్వాహకుడు దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో యువతుల నుంచి అండాలను సేకరించి కార్పొరేట్ ఫర్టిలిటీ కేంద్రాలకు పంపిస్తున్నారన్నారని తేలినట్టు సమాచారం. ఇప్పటివరకు ఎంతమంది యువతులు, మహిళల నుంచి అండాలను సేకరించారు.. వాటిని ఎక్కడెక్కడికి తరలించారు.. అనే పూర్తి వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు.



ఉద్యోగుల పొట్టకొడుతున్న ఏఐ!

వ్యాపార రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) వేగవంతమైన మార్పులు తెస్తోంది. ఈ నేపథ్యంలో అనేక సంస్థలు ఏఐలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అమెరికాకు చెందిన క్లౌడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ టెరాడేటా (ఎవతీఝఝు) కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తోంది. సంస్థలో పనిచేస్తున్న సుమారు 5,100 మంది ఉద్యోగులకు 2026 సంవత్సరంలో వార్షిక జీతాల పెంపు ఉండబోదని యాజమాన్యం ప్రకటించింది. టెరాడేటా సంస్థ సీఈఓ స్టీవ్ మెక్‌మిలన్ ఉద్యోగులకు పంపిన మెమోలో, 2026 సంవత్సరానికి కంపెనీ ప్రధాన లక్ష్యం.. ఏఐ రంగంలో విజయాన్ని సాధించడం అని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రతిభావంతులైన ఉద్యోగులను నియమించుకోవడం, ఏఐ సామర్థ్యాలను పెంచుకోవడం, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై పెట్టుబడులు పెట్టడం అవసరమని వివరించారు. ఈ పెట్టుబడులకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు వార్షిక జీతాల పెంపు కోసం కేటాయించిన బడ్జెట్‌ను ఏఐ అభివృద్ధికి మళ్లిస్తున్నట్లు తెలిపారు.సాధారణంగా.. కంపెనీలో ఉద్యోగులకు ప్రతి సంవత్సరం 2 నుంచి 4 శాతం వరకు జీతాల పెంపు ఉండేది. అయితే ఈసారి ఆ పెంపులను పూర్తిగా నిలిపివేశారు. అయినప్పటికీ ఉద్యోగుల కోసం అన్ని రకాల ప్రయోజనాలను రద్దు చేయలేదని సంస్థ స్పష్టం చేసింది. పర్ఫామెన్స్ బేస్డ్ బోనస్‌లు, షేర్ల రూపంలో ఇచ్చే ఈక్విటీ ఆధారిత ప్రోత్సాహకాలు కొనసాగుతాయని తెలిపింది.టెరాడేటా మాత్రమే కాకుండా.. మరో టెక్ కంపెనీ టీటీఈసీ కూడా అమెరికాలోని ఉద్యోగుల రిటైర్మెంట్ కంట్రిబ్యూషన్ ప్రయోజనాలను 2026 వరకు నిలిపివేసింది. ఆ నిధులను ఏఐ టూల్స్, ఉద్యోగుల శిక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఉద్యోగుల తొలగింపులుపై ప్రభావం చూపిన ఏఐ, ఇప్పుడు జీతాలపైనా కూడా ప్రభావం చూపుతోంది.

భారత ఆర్థిక వ్యవస్థ భేష్

ముంబై: రాజకీయ, భౌగోళిక సవాళ్ల నేపథ్యంలోనూ దేశ ఆర్థిక వ్యవస్థ నిలకడను చూపుతున్నట్లు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ జే. స్వామినాథన్ ఇటీవల పేర్కొన్నారు. ఇందుకు పారిశ్రామిక, సర?వసుల రంగాలు దన్నుగా నిలుస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా విస్తృత డిమాండ్, మెరుగుపడుతున్న కార్పొరేట్ ఫలితాలు తదితర అంశాలు వ్యవస్థ ప్రగతిశీలతకు మద్దతిస్తున్నట్లు వివరించారు. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత పరిధిలోనే ఉన్నట్లు కొలంబియా యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్(ఎస్ఐపీఏ) వద్ద ప్రసంగంలో సోమవారం ప్రస్తావించారు. విదేశీ ఆటుపోట్లను తట్టుకోగలమని ఈ సందర్భంగా తెలియజేశారు. జియోపాలిటిక్స్, వాతావరణ మార్పులు, ఏఐ, టెక్నాలజీ సవాళ్లపై ప్రపంచ పాలసీలు ఆధారపడుతున్న సందర్భంలో సమావేశంకానున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రసంగాన్ని ఆర్‌బీఐ తాజాగా వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసింది.

భారత్ ఆరోగ్య స్కోరు ఏ 65

మణిపాల్ సిగ్నా ఇండియా హెల్త్ కోషంట్‌లో వెల్లడి

అన్నింటికంటే వెనుకబడిన ఆర్థిక ఆరోగ్యం



ముంబై: దేశీయంగా ప్రజలు తమ శారీరక, మానసిక, ఆర్థిక ఆరోగ్యంతో పాటు ఉద్యోగాలు, బంధాలు మొదలైన వాటన్నింటినీ సమన్వయం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. శారీరక, మానసిక, ఆర్థిక, వృత్తి, సామాజికం అనే ఐదు అంశాలపై మణిపాల్ సిగ్నా ఇండియా నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఇందుకు సంబంధించిన హెల్త్ కోషంట్ 2026లో ప్రజల సమగ్ర ఆరోగ్య స్కోరు 100కి గాను 65గా నమోదైనట్లు సంస్థ వెల్లడించింది. శారీరక ఆరోగ్యం అత్యధికంగా 68 స్కోరు సాధించగా, ఆర్థిక ఆరోగ్యం 62 స్కోరుతో అన్నింటికంటే వెనుకబడింది. పట్టణ ప్రాంత భారతీయుల్లో 82 శాతం మంది ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ, కేవలం ఒక శాతం మంది మాత్రమే తమ ఆరోగ్యం బాగోలేదని అభిప్రాయపడ్డారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ వాడకంపై 63 శాతం మంది సానుకూలంగా ఉన్నప్పటికీ, అది వైద్యులకు సహాయకారిగా ఉండాలే తప్ప మానవ మేధస్సు స్థానాన్ని ఆక్రమించేదిగా ఉండకూడదని చెప్పారు. ప్రజలు చికిత్స ఎలా అందుతుందని ఆందోళన చెందడం కాకుండా తాము ఆరోగ్యంగా ఎలా ఉండాలనే దానిపై దృష్టి పెడుతున్నారని సంస్థ ఎండీ జాయ్‌దీప్ సాహా తెలిపారు.

పునరుత్పాదక ఇంధన రంగంలోకి భారీ పెట్టుబడులు

ఐదేళ్లలో రూ.11.52 లక్షల కోట్లు

భూ సమీకరణకే రూ.1.44 లక్షల కోట్లు

కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా

న్యూఢిల్లీ: దేశ పునరుత్పాదక ఇంధన రంగం (సోలార్, పవన విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపన) పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించనుంది. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలోకి 110--120 బిలియన్ డాలర్ల (రూ.11.52 లక్షల కోట్లు) మేర పెట్టుబడులు రానున్నట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా వెల్లడించింది. 7 లక్షల ఎకరాల భూ సమీకరణ కోసమే సుమారు 10--15 బిలియన్ డాలర్ల (రూ.96,000--1,44,000 కోట్లు) పెట్టుబడులు అవసరమని తెలిపింది. 2025 చివరికి పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపిత సామర్థ్యం 250 గిగావాట్లకు చేరుకున్నట్టు తెలిపింది. 2015 నాటికి ఉన్న 80 గిగావాట్లతో పోలి?చతే మూడు రెట్లు పెరిగినట్టు వెల్లడించింది. 2026 మార్చి నాటికి స్థాపిత సామర్థ్యం 275 గిగావాట్లకు చేరినట్టు పేర్కొంది. 2030 నాటికి 270--300 గిగావాట్ల సోలార్, పవన విద్యుదుత్పత్తి సామర్థ్యం అదనంగా తోడు కానున్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక అంచనా వేసింది. 2026--2030 కాలంలో 6.5 లక్షల ఎకరాలు ఒక్క సోలార్ ఇన్‌స్టాలేషన్లకే అవసరమవుతుందని.. మిగిలిన 50వేల ఎకరాలు పవన విద్యుత్‌కు కావాల్సి వస్తుందని పేర్కొంది.

500 మెగావాట్ల లక్ష్యం సాధ్యమే

సోలార్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటు కోసం ఒక్కో మెగావాట్‌కు రూ.3--4 కోట్లు, పవన విద్యుత్ ప్రాజెక్ట్‌ల (భూమిపై)కు సంబంధించి ఒక మెగావాట్ సామర్థ్యం కోసం రూ.8--9 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుందని కొలియర్స్ ఇండియా తెలిపింది. దేశీయంగా తయారీ సామర్థ్యాలు మరింత మెరుగుపడుతున్నందున 2030 నాటికి భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని సులభంగానే చేరుకుంటుందని భావిస్తున్నట్టు పేర్కొంది. అప్పటికి ఒక్క సోలార్ ప్రాజెక్టుల సామర్థ్యమే 400--450 గిగావాట్ల మేర ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం 146 గిగావాట్ల సామర్థ్యం మేర ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతున్నట్టు తెలిపింది. పునరుత్పాదక విద్యుత్ రంగం శరవేగంగా విస్తరిస్తుండడం రియల్ ఎస్టేట్ రంగానికి అవకాశాలు కలి?పస్తుందని.. ముఖ్యంగా భూ సమీకరణ, పునరుత్పాదక ఆధారిత పారిశ్రామిక పార్కుల్లో అవకాశాలు ఉంటాయని అంచనా వేసింది.

వెండి హాల్‌మార్కింగ్ సవాళ్లపై అధ్యయనం

న్యూఢిల్లీ: వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ నిబంధనలను తప్పనిసరి చేసేందుకు మౌలిక సదుపాయాల సన్నద్ధతకు సంబంధించిన సవాళ్లను అధ్యయనం చేస్తున్నట్లు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గర్గ్ తెలిపారు. జ్యుయలరీ, కళాకృతులు, ఫర్నిచర్ తదితర రూపాల్లో కూడా వెండిని చాలా స్టోర్స్‌లో విక్రయిస్తారు కాబట్టి మార్కెట్‌పరంగా చూసినప్పుడు పసిడితో పోలిస్తే సిల్వర్ హాల్‌మార్కింగ్ చాలా సంక్లిష్టంగా ఉంటుందని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. బీఐఎస్‌లో మొత్తం హాల్‌మార్కింగ్ కార్యకలాపాలను కేవలం అయిదుగురు మాత్రమే పర్యవేక్షిస్తుంటారని, మిగతా సిబ్బంది అంతా ప్రైవేట్ లేదా ఔట్‌సోర్సింగ్ వారే అయి ఉంటారని గర్గ్ చెప్పారు. ప్రైవేట్ వర్గాల సహాయంతో హాల్‌మార్కింగ్ సెంటర్లను నిర్వహించడం, నమ్మకాన్ని చూరగొనడం అనేది చాలా కష్టతరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తప్పనిసరి సిల్వర్ హాల్‌మార్కింగ్‌ని క్రమంగా అమల్లోకి తేనున్నట్లు గర్గ్ చెప్పారు. 2005 నుంచి వెండికి హాల్‌మార్కింగ్ స్వచ్ఛందంగా అమలవుతోంది. 2025 సెప్టెంబర్ నుంచి సిల్వర్ ఆర్టికల్స్ స్వచ్ఛతకు సంబంధించి హాల్‌మార్క్ విశిష్ట గుర్తింపు (యూహెచ్ఐడీ) సంఖ్యను అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం వెండి ఆభరణాలను పరీక్షించేందుకు బీఐఎస్ గుర్తింపు పొందిన అసేయింగ్, హాల్‌మార్కింగ్ సెంటర్లు (ఏహెచ్‌సీ) సుమారు 230 ఉన్నాయి.

ప్రయోగం నుంచి వినియోగం వైపు

న్యూఢిల్లీ: దేశీ ఐటీ పరిశ్రమ కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా పరీక్షించే దశ నుంచి క్రమంగా విస్తృతంగా వినియోగించే దశ వైపు మళ్లుతున్నాయి. సంస్థాగతంగా కార్యకలాపాలకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏఐ ఏజెంట్లను అనుసంధానం చేసుకుంటున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో దేశీ ఐటీ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో సంస్థలు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్ వినియోగాన్ని మూడు లక్షల మందికి పైగా ఉద్యోగులకు అందుబాటులోకి తెచ్చాయి. తద్వారా అంతర్జాతీయంగా భారీ స్థాయిలో ఏఐని వినియోగిస్తున్న దిగ్గజాల సరసన చేరాయి. భారత్‌లో గణనీయంగా సిబ్బంది ఉన్న యాక్సెంచర్ కూడా వేల కొద్దీ ఉద్యోగులకు కోపైలట్‌ని అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ చేపట్టింది.'రోజువారీ ఉత్పాదకతను పెంచుకునేందుకు, కలిసి పనిచేయడాన్ని ప్రోత్సహించేందుకు, తెలివిగా నిర్ణయాలను తీసుకోవడంలోను తోడ్పడేందుకు మేము 1,00,000 మంది సిబ్బందికి మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌ని అందుబాటులోకి తెచ్చాం' అని టీసీఎస్ సీఈవో కె. కృతివాసన్ తెలిపారు. సంస్థ రోజువారీ కార్యకలాపాల్లో టెక్నాలజీని భారీగా వినియోగించడం ద్వారా అవకాశాలను మరింతగా అందిపుచ్చుకోవచ్చని ఇన్ఫోసిస్ సీఈవో సలిల్ పరేఖ్ తెలిపారు. ఏఐని తాము రోజువారీ పనుల్లో అనుసంధానిస్తున్నామని, తద్వారా ఉత్పాదకతను పెంచుకోవడం, నిర్ణయాలను పక్కాగా అమలుచేయడం, ఆవిష్కరణలను వేగవంతం చేయడంలాంటి అంశాలకు ఏఐ ఉపయోగపడుతుందని విప్రో సీఈవో శ్రీని పల్లియా తెలిపారు.

కలిసి పని చేసే హైబ్రిడ్ విధానం..

ఏఐ కార్యకలాపాలను కేవలం స్టాండెలోన్ సాధనాలుగా కాకుండా మనుషులు, ఏజెంట్లు కలిసి పని చేసే విధానంగా తీర్చిదిద్దుకోవడంపై కంపెనీలు కసరత్తు చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్‌కి చెందిన వర్క్ ట్రెండ్స్ ఇండెక్స్ 2026 ప్రకారం ఈ తరహా ఏఐ వినియోగం .. ప్రాథమిక ఆటోమేషన్ పరిధిని దాటి విశ్లేషణ, సమస్యల పరిష్కారంలాంటి పనులను సులభతరం చేస్తోంది. కంపెనీవ్యాప్తంగా ఏఐని ఉపయోగించడం వల్ల దేశీ ఐటీ దిగ్గజాలకు భారీగా ఆదా అవుతోంది.

భారత్ వృద్ధి అంచనా 6.4 శాతానికి కట్

గత అంచనా 6.6 శాతం

అయినా వేగవంతమైన ఆర్థిక వ్యవస్థే

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పశ్చిమాసియా షాక్

ఐక్యరాజ్య సమితి నివేదిక



న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు, పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో 2026 సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి రేటు అంచనాను ఐక్యరాజ్యసమితి (యూఎన్) స్వల్పంగా తగ్గించింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో గత అంచనా 6.6 శాతాన్ని 6.4 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది.

పశ్చిమాసియా సంక్షోభం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పశ్చిమాసియా సంక్షోభం మరో షాక్‌గా ఈ నివేదిక అభివరి?ణించింది. ఇది ప్రపంచ వృద్ధిని మందగింపజేయడంతోపాటు, ద్రవ్యోల్బణం ఒత్తిళ్లను, అనిశ్చితులను పెంచినట్టు వివరించింది. ప్రస్తుత ప్రపంచ ప్రతికూల సవాళ్ల నుంచి భారత్‌కూ మినహాయింపు లేదని యూఎన్ గ్లోబల్ ఎకనామిక్ మానిటరింగ్ విభాగం సీనియర్ ఆర్థికవేత్త ఇంగో పిట్టర్లే వ్యాఖ్యానించారు. "భారత్ ఇంధనాన్ని భారీగా దిగుమతి చేసుకుంటోంది. విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌లపై ప్రభావం తదతర ఒత్తిళ్లు సైతం నెలకొన్నాయి. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితుల కఠినతరంతో మానిటరీ పాలసీ మరింత సంక్లిష్టంగా మారింది" అని పిట్టర్లే వివరించారు. ఈ పరిస్థితుల్లో ఆర్‌బీఐ, ఆర్థిక శాఖ ఎలా స్పందిస్తాయన్నదే కీలకమన్నారు.

ప్రపంచ జీడీపీ వృద్ధి అంచనా సైతం తగ్గింపు

2026 సంవత్సరానికి గాను ప్రపంచ స్థూల జీడీపీ వృద్ధి రేటు అంచనాను సైతం 2.5 శాతానికి యూఎన్ తగ్గించింది. జనవరిలో వేసిన అంచనా కంటే 0.2 శాతం తక్కువ కావడం గమనార్హం. అంతేకాదు, కరోనా మహమ్మారికి ముందున్న సాధారణ వృద్ధి రేటు కంటే ఇది చాలా తక్కువని ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

బలంగానే ఆర్థిక మూలాలు..

భారత్ వృద్ధి 2025లో ఉన్న 7.5 శాతం నుంచి 2026లో 6.4 శాతం తగ్గడమన్నది ప్రధానంగా ఇంధన దిగుమతి వ్యయాలు పెరిగిపోవడం వల్లేనంటూ.. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. దేశీయంగా వినియోగ డిమాండ్, ప్రభుత్వ మూలధన వ్యయాలు, సేవల రంగ ఎగుమతుల్లో చక్కని పనితీరు కారణంగా భారతదేశంలో నిర్మాణాత్మకంగా బలమైన వృద్ధి కనిపిస్తున్నట్టు పేర్కొంది. తిరిగి 2027 సంవత్సరంలో ఆర్థిక వృద్ధి రేటు 6.6 శాతానికి పుంజుకుంటుందని అంచనా వేసింది.

'బౌన్స్ బ్యాక్ అవ్వాలా? ఎందుకు?'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ తన శరీరాకృతిపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయని, అలాంటి సమయంలోనూ పాత రూపంతో పోలుస్తూ విమర్శించడం సరైంది కాదనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన జీవితంలోని అందమైన దశను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రసవం తర్వాత మహిళలు వెంటనే మునుపటి శరీరాకృతికి తిరిగి రావాలనే ఒత్తిడిపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కత్రినా కైఫ్, ఆమె భర్త విక్కీ కౌశల్ ఇటీవల అంబానీ కుటుంబం నిర్వహించిన గణేశ్ చతుర్థి వేడుకలకు హాజరయ్యారు. తల్లి అయిన తర్వాత చాలా కాలానికి ఆమె బహిరంగంగా కనిపించడంతో ఆ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. అయితే కొందరు నెటిజన్లు ఆమె ప్రస్తుత రూపాన్ని గతంలో ఉన్న రూపంతో పోలుస్తూ వ్యాఖ్యలు చేశారు. ప్రసవం తర్వాత బరువు పెరిగారంటూ విమర్శలు చేయడంతో ఈ వ్యవహారం చర్చకు దారితీసింది. కత్రినాకు మద్దతుగా పలువురు ప్రముఖులు, అభిమానులు నిలిచారు. ప్రసవం తర్వాత శరీరంలో వచ్చే మార్పులు సహజమని, వాటిని విమర్శలకు కారణంగా మార్చకూడదని అభిప్రాయపడ్డారు. తాజాగా కత్రినా సైతం ఈ విమర్శలపై స్పందిస్తూ తన ఆలోచనలను పంచుకున్నారు. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో వచ్చే మార్పుల గురించి చాలామందికి అవగాహన ఉంటుందని కత్రినా పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు అలాంటి మార్పులను విమర్శించాలని నిర్ణయించుకుంటే అది వారి వ్యక్తిగత నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఇతరుల అభిప్రాయాల కోసం తన జీవితంలోని ముఖ్యమైన దశను పక్కన పెట్టబోననే విషయాన్ని ఆమె స్పష్టం చేశారు. ప్రసవం తర్వాత మహిళలు వీలైనంత త్వరగా గతంలో ఉన్న శరీరాకృతికి తిరిగి రావాలనే భావనపై కూడా కత్రినా స్పందించారు. 'బౌన్స్ బ్యాక్' అనే పదాన్ని ప్రస్తావిస్తూ, తన జీవితంలోని ఈ అందమైన దశను ఆస్వాదిస్తూ ముందుకు సాగాలనుకుంటున్నట్లు తెలిపారు. తన మనసులో ఎప్పటినుంచో ఉన్న ఒక బలమైన కోరికను నెరవేర్చుకుంటూ జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టానని, అలాంటప్పుడు మళ్లీ వెనక్కి వెళ్లాలని ఎందుకు అనుకోవాలని ప్రశ్నించారు. తన ఫిట్‌నెస్ ప్రయాణంపై తనకు అవగాహన ఉందని, తన శరీరం ఎప్పుడు చురుగ్గా ఉంటుందో కూడా తెలుసని ఆమె



జైలర్ 2 ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయిందా ..

సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో వచ్చిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. అక్టోబర్ 15న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.755 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ప్రచారం జరుగుతోంది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా డిజిటల్ విడుదల తేదీపై ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'జైలర్ 2' డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా నవంబర్ 12 నుంచి స్ట్రీమింగ్‌కు రానుందనే ప్రచారం ప్రస్తుతం సాగుతోంది. తమిళంతో పాటు తెలుగు, ఇతర భాషల్లోనూ అందుబాటులోకి రానుందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, నవంబర్ 12నే విడుదలవుతుందనే విషయంపై చిత్ర బృందం లేదా ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి స్ట్రీమింగ్ తేదీపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన కోసం వేచి చూడాలి. 2023లో విడుదలైన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా 'జైలర్ 2' తెరకెక్కింది. మొదటి భాగానికి వచ్చిన ఆదరణతో రెండో భాగంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించడం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విద్యా బాలన్, ఎస్.జే. సూర్య, జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా, సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. భారీ తారాగణం, యాక్షన్ సన్నివేశాలు, రజనీకాంత్ స్టైల్ ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. థియేటర్లలో సినిమా చూసినవారు ఇప్పుడు ఓటీటీ విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.

ఆ పాత్ర కోసం ప్రాణం పణంగా పెట్టా

నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు. 2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్ కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

ఆర్‌సీ17 లో విజయ్ సేతుపతి?

రామ్‌చరణ్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత వీరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. 'ఆర్‌సీ 17' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమా నవంబర్ 1న పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభంకానుందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ సినిమా కాస్టింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త బయటికొచ్చింది. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రకోసం ప్రముఖ తమిళ నటుడు విజయ సేతుపతి తీసుకోవాలని దర్శకుడు సుకుమార్ భావిస్తున్నట్లు తెలిసింది. విలక్షణ నటుడిగా పేరున్న విజయ్ సేతుపతి ఈ సినిమాలో భాగమైతే తమిళనాట కూడా ప్రాజెక్ట్‌పై హైప్ పెరిగే అవకాశముందని అంటున్నారు. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి.

ఆదర్శ కుటుంబం'.. జస్ట్ ఇదొక్కటి వస్తే చాలు!

టాలీవుడ్ నుంచి రిలీజ్ కి రాబోతున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే ఆదర్శ కుటుంబం. వెంకీ మామ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో చేసిన ఈ ఫ్యామిలి డ్రామా పలుమార్లు వాయిదా తర్వాత కొంచెం రాష్ట్రంలో పరిస్థితులు అటు ఇటుగా ఉన్నప్పటికీ మేకర్స్ విడుదలకి తీసుకొస్తున్నారు. అయితే ఈ సినిమాకి ట్రైలర్ తర్వాత ఆడియెన్స్ లో మరిన్ని అంచనాలు ఏర్పడ్డాయి. కానీ త్రివిక్రమ్, వెంకీ మామ కాంబినేషన్ అంటే ఉండాల్సిన హైప్ ఇది కాదు. సో దీన్ని రీచ్ అయ్యి బాక్సాఫీస్ దగ్గర హిట్ కొట్టాలంటే సినిమా విడుదల అయ్యాక టాక్ మాత్రం పాజిటివ్ గా పడాల్సిందే అని చెప్పాలి. సినిమాలు చూడండి ఇదొక్కటి పడితే చాలా రోజులు నుంచి సరైన ఫ్యామిలీ ఎంటర్టైనర్ లేక ఆకలి మీద ఉన్న కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకి క్యూ కడతారు. ఇక మీద అంతా కంటెంట్ మీదనే ఆధారపడి ఉందని చెప్పాలి. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందించాడు. చినబాబు నిర్మాణం వహించారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com